వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో జస్టిస్ సుజయ్‌పాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

హైకోర్టులో ఉచిత వైద్యశిబిరం

హైదరాబాద్, అక్టోబర్ 4, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని హైకోర్టు ఆవరణలో శుక్రవారం ఉచిత వైద్య, రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, ఉస్మానియా దవాఖాన, నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ప్రారంభించారు. న్యాయవాదులు, హైకోర్టు సిబ్బందికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటుచేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సుజయ్‌పాల్, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, పలువురు న్యాయమూర్తులు, న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి పంచాక్షరి, బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ నరసింహారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ రవీందర్‌రెడ్డి, ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ కుమార్, నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ సీఈవో మయూర్ పట్నాల పాల్గొన్నారు.

నల్లగొండ బీఆర్ఎస్ కార్యాలయ నిర్మాణంపై స్టేటస్‌కో

- యథాతథ స్థితిని కొనసాగించాలన్న హైకోర్టు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): నల్లగొండ జిల్లాలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యాలయ నిర్మాణానికి సంబంధించి హైకోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భవన నిర్మాణంపై తాజాగా దాఖలైన పిటిషన్‌ను బీఆర్ఎస్ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌తో కలిపి ఈ నెల 21న విచారణ జరుపుతామని, అప్పటివరకు అక్కడ యథాతథ స్థితిని కొనసాగించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం శుక్రవారం స్పష్టం చేసింది.

● మున్నేరు బాధితులను ఆదుకోవాలని నిరసన

ఖమ్మం మున్నేరు వరద బాధితులను ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగా ముంపునకు గురైన బాధిత కుటుంబాలకు రూ.16,500 సాయాన్ని తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు.

బతుకమ్మపై సర్కారు నిర్లక్ష్యం

- సమీక్ష కూడా జరపని సీఎం రేవంత్‌రెడ్డి
- పండుగకు చిల్లిగవ్వ ఇవ్వని ప్రభుత్వం
- పలుచోట్ల మహిళల ఆటపాటలకు ఆటంకాలు
- కేసీఆర్ హయాంలో వారంనుంచే సంబురం

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ కళతప్పింది. ఊరూరా కొండంత అన్నంతగా జరుపుకునే ఈ పండుగ నిర్వహణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నది. ఉద్దేశపూర్వకంగానే సర్కారు పెద్దలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వచ్చాయి. పండుగ ఏర్పాట్లకు కనీస ఏర్పాట్లు చేయకపోగా, ఆడబిడ్డలకు ప్రభుత్వం ఇచ్చే చీర కానుకను సర్కారు ఎగ్గొట్టింది. సద్దుల బతుమ్మకు కోసమైనా ప్రభుత్వం ఏర్పాట్లను ఘనంగా చేస్తుందని భావించినా అదీ ఎండమావే అయింది. సీఎం రేవంత్‌రెడ్డి, సంబంధిత మంత్రి పండుగ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన దాఖలాలు కూడా లేవు. సీఎస్ సమీక్ష నిర్వహించారని చెప్తున్నా దానికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనేలేదు. బతుకమ్మ ఏర్పాట్లకోసం ఉన్నతాధికారుల నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు జారీకాలేదని క్షేత్రస్థాయి అధికారులు చెప్తుండటమే ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నది. రాష్ట్ర సాంస్కృతిక శాఖ సహా భాగస్వామ్య శాఖలు సకల ఏర్పాట్లు చేయాలని గతంలో వారం రోజుల ముందే ఏటా సీఎం ఆదేశాలు జారీ చేసేవారు. పండుగ నిర్వహణకు అవసరమైన నిధులను విడుదల చేసే సంప్రదాయం ఉండేది. పండుగ మొదలై సద్దుల బతుకమ్మ దగ్గర పడుతున్నా ఇప్పటివరకు చిల్లిగవ్వ కూడా విడుదల చేయలేదు. జీహెచ్ఎంసీ పరిధిలో గణేశ్ నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన 'బేబీ పాండ్స్' (చిన్న నీటివనరులు)ను నేటికీ తొలగించకుండా నిర్లక్ష్యం చూపుతున్నారు.

అడుగడుగునా ఆటంకాలే..

ఒకవైపు ప్రభుత్వం ఏర్పాట్లు చేయకపోగా, మరోవైపు ఆడిపాడే మహిళలకు రాష్ట్రంలోని పలుచోట్ల ఆటంకాలే ఎదురవుతున్నాయి. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలో బతుకమ్మ ఆడేందుకు వెళ్లిన ఆడబిడ్డలను అవమానపరిచారు. మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గం వెంకటాపూర్ మండలం పెద్దంపల్లి గ్రామంలో, భూపాలపల్లి జిల్లాలోని పలుచోట్ల విద్యుత్తు సౌకర్యం కల్పించని ఘటనలు వెలుగు చూశాయి. ఈ కారణంగా సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

నార్త్ కరోలినాలో అధికారికంగా బతుకమ్మ

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రంలో ఏటా అక్టోబర్ మొదటివారంలో బతుకమ్మ పండుగను అధికారికంగా జరుపుకోనున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం ఆ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ మార్క్ కే రాబిన్సన్ కార్యాలయం ప్రకటించింది. 'తెలంగాణలో ప్రధానంగా జరుపుకొనే ఈ పండుగ అక్కడి ప్రజల సాంస్కృతిక వారసత్వం, ఐక్యతా స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ నుంచి నార్త్ కరోలినాకు వచ్చిన ప్రజలు ఈ పండగను ఉమ్మడి జరుపుకోవచ్చని గవర్నర్ తెలిపారు.

బ్రహ్మచారిణి దేవీగా జోగులాంబ

దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో రెండోరోజైన శుక్రవారం అలంపూర్‌లోని జోగులాంబ దేవిని బ్రహ్మచారిణిగా అలంకరించారు. ఒక చేతిలో కమండలం, మరో చేతిలో దండం ధరించి భక్తులకు దర్శనమిచ్చారు.

- అలంపూర్

వేములవాడలో బ్రహ్మచారిణిగా..

వేములవాడ రాజన్న ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు శుక్రవారం బ్రహ్మచారిణి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి అమ్మవారిని నెమలి వాహనంపై ఊరేగించారు.

- వేములవాడ టౌన్

విద్యుత్తు ఉద్యోగుల బదిలీలకు వెబ్ కౌన్సెలింగ్

- ఒకసారి ఫోకల్ పోస్టులో పనిచేస్తే మళ్లీ అవకాశం లేనట్టే
- ఉద్యోగుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన కొత్త విధానం

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): విద్యుత్ శాఖలో ఉద్యోగుల బదిలీ ప్రక్రియ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎంసెట్ కౌన్సెలింగ్ తరహాలో ఉద్యోగుల బదిలీలు చేపట్టడం, ఒకే తరహా పోస్టుల్లో మళ్లీ పనిచేసేందుకు అవకాశం లేకుండా వెబ్ అప్లికేషన్‌ను రూపొందించడం చాలా మందికి మింగుడు పడటం లేదు. దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)లో ఒకే చోట 2 ఏండ్లు పైబడి పనిచేసిన వారికే బదిలీ ఆప్షన్స్ ఇచ్చారు. డిస్కంలోని మొత్తం ఉద్యోగుల్లో 50% మందినే బదిలీ చేయాలని నిర్ణయించి, అందులో దాదాపు 850 ఉద్యోగులకు వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం కల్పించారు. విద్యుత్తు శాఖలో బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాల ప్రకారం ఈ నెల 7 వరకు గడువు ఇచ్చారు. ప్రస్తుతం డీఈ (డివిజినల్ ఇంజినీర్), ఏడీఈ, ఏఈ నుంచి కింది స్థాయి ఉద్యోగులు బదిలీల ప్రక్రియలో పాల్గొంటున్నారు.

చర్చంతా ఫోకల్ పోస్టులపైనే

ప్రస్తుతం బదిలీల కోసం జరుగుతున్న వెబ్ కౌన్సెలింగ్‌లో చర్చంతా ఫోకల్ పోస్టుల చుట్టూనే నడుస్తున్నది. ఇప్పటివరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్నతాధికారులైనా, తర్వాతి స్థాయి ఉద్యోగులైనా ఫోకల్ పోస్టుల్లో పనిచేసి ఉంటే.. వారికి బదిలీల సమయంతో వేరే నాన్-ఫోకల్ పోస్టులకు సంబంధించిన ప్రాంతాలే కనిపిస్తున్నాయి. దీంతో ఎంతో కీలకమైన ఫోకల్ పోస్టును తాజా బదిలీల్లో మళ్లీ సాధించే అవకాశం లేకుండా పోతున్నదని కొందరు మదనపడుతుండగా.. మరికొందరు మాత్రం ఇది మంచి విధానమని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలోని 10 సర్కిళ్లలో పోస్టింగ్ కోసం చూస్తున్నవారికి ఈ విధానం అవకాశం ఇవ్వడం లేదని, గ్రామీణ ప్రాంతాలు, ప్రాధాన్యత లేని పోస్టుల్లో పనిచేసినవారికి ఇది మంచి అవకాశమని పేర్కొంటున్నారు. విద్యుత్తు శాఖలో బదిలీ ప్రక్రియ 7 తర్వాత ముగుస్తుందని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

డీఎస్సీ-2008 లిస్టులో 8 పేర్లు గల్లంతు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ-2008 జాబితాలో అర్హులైన కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన ఎనిమిది మంది పేర్లు గల్లంతయ్యాయి. 2010 జూన్‌లో విద్యాశాఖ విడుదల చేసిన కామన్ మెరిట్ లిస్ట్‌లో పేరు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ శనివారంతో ముగియనుండటంతో తమకు చోటు కల్పించాలని అభ్యర్థులు వేడుకున్నారు. 2008-డీఎస్సీ బాధితులకు కాంట్రాక్టు ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు విద్యాశాఖ వెబ్‌సైట్‌లో జిల్లాలవారీగా జాబితాను పొందుపరిచింది. అయితే కొన్ని జిల్లాల్లో బాధితుల పేర్లు కనిపించకపోవడంతో 2010 జూన్‌లో విద్యాశాఖ విడుదల చేసిన కామన్ మెరిట్ లిస్ట్ ప్రకారం సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కానీ కరీంనగర్‌లో మాత్రం అధికారులు కామన్ మెరిట్ లిస్టు పట్టించుకోవడంలేదని అభ్యర్థులంటున్నారు. అడిగితే ఇదే ఫైనల్ జాబితా అని సమాధానం ఇస్తున్నట్టు చెప్పున్నారు. 14 ఏళ్లుగా కోర్టుల చుట్టూ తిరిగి అలిసిపోయామని, ప్రభుత్వం న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తుంటే అధికారులు అడ్డుకోవడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏసీబీ అధికారులమంటూ ఫేక్ కాల్స్

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : 'నేను ఏసీబీ అధికారిని. హైదరాబాద్ హెడ్ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నా. మీకు లంచం తీసుకుంటున్నట్టు మా దృష్టికి వచ్చింది. కొంత డబ్బులిస్తే మీపై కేసు కాకుండా చూస్తాం. ఏసీబీ రైడ్ ఎప్పుడు జరుగుతుందో మీకు చెబుతాం. జాగ్రత్తపడండి' అంటూ ప్రభుత్వ ఉద్యోగులకు కొందరు అక్రమార్కులు కాల్స్ చేస్తున్నారు. ఇటీవల ఈ కాల్స్‌కు భయపడి జనగామకు చెందిన ఇద్దరు మహిళా అధికారులు విడతల వారీగా రూ.70 వేలు సమర్పించుకున్నారు. ఖమ్మంలోనూ ఈ తరహా ఘటనలు నమోదైనట్టు ఏసీబీ అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో ఏసీబీ ఏడీజీ విజయ్‌కుమార్ స్పందించారు. ఈ తరహా కాల్స్‌కు అధికారులు, ప్రజలు డబ్బులు సమర్పించొద్దని, ఏసీబీ అధికారులు అటువంటి కాల్స్ చేయరని స్పష్టం చేశారు.

మంత్రులతో ముఖాముఖి వాయిదా

- నిరాశతో వెనుదిరిగిన కార్యకర్తలు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): గాంధీభవన్‌లో శుక్రవారం నిర్వహించాల్సిన మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం వాయిదా పడింది. ముందస్తు సమాచారం లేకుండా కార్యక్రమాన్ని వాయిదా వేయడంతో కార్యకర్తలు అసంతృప్తికి లోనయ్యారు. గంటల తరబడి పడిగాపులు కాసి నిరాశతో వెనుదిరిగారు. ప్రజాభవన్‌లో శుక్రవారం ప్రజావాణి నిర్వహిస్తున్న నేపథ్యంలో ముఖాముఖి కార్యక్రమాన్ని సోమవారానికి వాయిదా వేసినట్టు గాంధీభవన్ వర్గాలు ఒక ప్రకటన విడుదల చేశాయి.

సింగరేణిల జీవితాల్లో కాకాది చెరగని ముద్ర

- సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): పేదల హృదయాల్లో దీపమై వెలిగిన మహనీయుడు కాకా(జి.వెంకటస్వామి) అని సీఎం ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం జీ వెంకటస్వామి జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా, సేవలందించారని, సింగరేణి కార్మికుల జీవితాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని గుర్తుచేశారు. తెలంగాణ తొలి దశ, మలిదశ ఉద్యమాల్లో కాకా అలుపెరుగని పోరాటం చేశారని, 1969లో తెలంగాణ కోసం జైలు కెళ్లాడని సీఎం అన్నారు.

ప్రజావాణికి 338 దరఖాస్తులు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 338 దరఖాస్తులు అందాయి. గృహ నిర్మాణ శాఖకు 79, రెవెన్యూ సమస్యలపై 52, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 35, విద్యుత్తు సమస్యలపై 35, ఎస్సీ సంక్షేమ శాఖకు 29, ప్రవాసీ ప్రజావాణి ద్వారా 4, ఇతర శాఖలకు సంబంధించి 104 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య దరఖాస్తులను స్వీకరించారు.

4 కార్పొరేషన్లుగా జీహెచ్ఎంసీ

- వచ్చే ఎన్నికల నాటికి ఏర్పాటు చేస్తాం
- హైదరాబాద్ దశ-దిశను మారుస్తాం
- హైకోర్టు భవనంలో పార్కింగ్‌పై ఆలోచన
- అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్‌లో మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను (జీహెచ్ఎంసీ) 4 కార్పొరేషన్లుగా ఏర్పాటు చేస్తామని, వచ్చే ఎన్నికల నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. అసోచాం ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్ఐసీసీ నోవాటెల్‌లో నిర్వహించిన 'అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్-2024' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తుంటే విపక్షాలు ఎందుకు అడ్డుకుంటున్నాయో అర్థం కావడం లేదని చెప్పారు. సబర్మతి, నమామి గంగే ప్రాజెక్టుల మాదిరిగా ప్రజల సంక్షేమం కోసం మూసీ ప్రక్షాళనకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు.

రాష్ట్రంలో పట్టణీకరణ జరగాలి

రాష్ట్రంలో పట్టణీకరణ జరగాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ దశ-దిశను మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని చెప్పారు. హైకోర్టు భవనంలో పీపీపీ విధానంలో పార్కింగ్ వసతిని ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర సుస్థిరాభివృద్ధి, స్థిరమైన మౌలిక వసతుల నిర్మాణం కోసం ప్రగతిశీలక నిర్ణయాలు తీసుకుంటున్నట్టు తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి బలమైన పునాదులు వేయడంతోపాటు రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చేందుకు అనేక మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని, అందులో భాగంగా పలు రోడ్లు, ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలు నిర్మిస్తున్నామని చెప్పారు.

పట్టణాల్లో మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ

పట్టణాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ఎస్టీపీలు నిర్మించి, మెరుగైన మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నమని చెప్పారు. హైదరాబాద్‌లో పట్టణ విస్తరణ, మౌలిక వసతుల కల్పనలో భాగంగా మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, కొత్త విమానాశ్రయాల నిర్మాణం, శాటిలైట్ టౌన్ షీప్‌ల ఏర్పాటు, మెట్రో విస్తరణ, జీహెచ్ఎంసీ పునర్వ్యవస్థీకరణ, ఎలివేటెడ్ కారిడార్లు, రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), హైకోర్టు భవన నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్, ఉస్మానియా నూతన భవన నిర్మాణం పనులను వేగవంతం చేస్తున్నట్టు మంత్రి వివరించారు. కార్యక్రమంలో అమెరికన్ కాన్సుల్ జనరల్ (చీఫ్ పొలిటికల్ అండ్ ఎకనమిక్ సెక్షన్), ఫీనిక్స్ గ్రూప్ చైర్మన్ సురేశ్ చుక్కపల్లి, అలార్డ్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పూనమ్ కశ్యప్, అసోచాం రాష్ట్ర ప్రతినిధి దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

గందరగోళంగా సెర్చ్ కమిటీ సమావేశాలు

- కొసాసాగుతున్న వాయిదాల పర్వం
- మొత్తంగా 6 వర్సిటీలకు ముగిసిన సమావేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ): యూనివర్సిటీలకు కొత్త వైస్‌చాన్స్‌లర్లను ఎంపికచేసే సెర్చ్ కమిటీ సమావేశాలు గందరగోళాన్ని తలపిస్తున్నాయి. వీసీల పేర్లను ఖరారుచేసే సెర్చ్ కమిటీ సమావేశాలు వరుసగా వాయిదాపడుతున్నాయి. శుక్రవారం జరగాల్సిన తెలంగాణ, కాకతీయ వర్సిటీల సెర్చ్ కమిటీ సమావేశాలు రెండు వాయిదాపడ్డాయి. సెర్చ్ కమిటీ సభ్యులు అందుబాటులో లేకపోవడం, ఆయా సభ్యులతో సమన్వయం చేసుకోవడంలో ప్రభుత్వం విఫలంకావడంతో ఈ సమావేశాలు వరుసగా వాయిదాపడుతున్నాయి. పది వర్సిటీ సెర్చ్ కమిటీ సమావేశాలకు ప్రభుత్వం షెడ్యూల్ ఖరారుచేయగా, ఇప్పటి వరకు ఆరు వర్సిటీల సమావేశాలు పూర్తయ్యాయి. జేఎన్ఎఫ్ఏయూ, బీఆర్ అంబేద్కర్ వర్సిటీ, తాజాగా తెలంగాణ, కాకతీయ వర్సిటీ సెర్చ్ కమిటీల సమావేశాలు వాయిదా పడుతూ వస్తున్నాయి. శుక్రవారం జేఎన్టీయూ, శాతవాహన వర్సిటీల సెర్చ్ కమిటీ సమావేశాలను మాత్రమే నిర్వహించారు. ఇప్పటికే మహాత్మాగాంధీ, పాలమూరు, ఉస్మానియా, తెలుగు వర్సిటీ సెర్చ్ కమిటీ సమావేశాలు ముగిశాయి. ప్రభుత్వం ఏకపక్షంగా సమావేశాల షెడ్యూల్‌ను ఖరారుచేయడాన్ని సెర్చ్ కమిటీ సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. సమావేశాలు జరిగిన ఆరు వర్సిటీల వీసీల నియామకంపై ముందుకెళ్లడమా? లేక.. మొత్తం ప్రక్రియ పూర్తయ్యేవరకు ఆగడమా? అన్న ప్రశ్నలు ప్రభుత్వాన్ని వేధిస్తున్నాయి.

అన్నారం బరాజ్‌లో తొలగిన ఇసుక

అన్నారం బరాజ్‌లో తొలగిన ఇసుక

పక్కా ప్లాన్ ప్రకారం తీసివేసిన అధికారులు

కాళేశ్వరం, అక్టోబర్ 4: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం బరాజ్‌లో ఉన్న 20 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తొలగించారు. గోదావరి నది, మానేరు వాగు వరదలతో బరాజ్ గేట్ల ప్రాంతంలో ఇసుక భారీగా వచ్చి చేరడంతో గేట్లు వేసే పరిస్థితే లేదు. ఇసుకను అలాగే ఉంచితే బరాజ్ కింది భాగంలోని బెడ్‌తోపాటు కాంక్రీట్ నిర్మాణాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్న విషయాన్ని గమనించిన ఇంజినీర్లు ఇసుకను తొలగించాని నిర్ణయించారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం అంతగా పడకుండా, బరాజ్ దెబ్బతినకుండా ఉండేందుకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంచుకున్నారు. ఇంతలో మళ్లీ వర్షాలు పడటంతో గేట్లు అన్నింటిని మూసివేసి ఒక్కో దాన్ని తెరిచి ఫ్లషింగ్ టెక్నిక్ విధానం ద్వారా వరద నీటిని అటుగా మళ్లించి గేట్ల కింద పేరుకుపోయిన ఇసుకను దిగువకు పంపించడంలో సఫలమయ్యారు. ఇదే విధానాన్ని అన్ని గేట్ల విషయంలోనూ అమలు చేయడంతో అన్నారం బరాజ్‌లో పేరుకుపోయిన 20 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక మొత్తాన్ని కూడా దిగువకు పంపించగలిగారు. లేనట్టయితే అటు బరాజ్ బేస్ దెబ్బతినడంతోపాటు గేట్లను కూడా మూసి వేసే అవకాశం లేకుండా పోయేది.

మీ ఊళ్లోనే చూయించుకో..పో!

- గర్భిణికి వైద్యం నిరాకరణ
- జనగామ జిల్లాలోని ఎంసీహెచ్‌లో ఘటన
- గట్టిగా నిలదీయడంతో వైద్య పరీక్షలు చేసిన సిబ్బంది

జనగామ రూరల్, అక్టోబర్4: 'మీ ఊరెక్కడ.. ఇక్కడి దవాఖానకు ఎందుకొచ్చావ్..అక్కడికే పోయి చూయించుకో పో' అంటూ ఓ గర్భిణికి వైద్యం నిరాకరించిన ఘటన జనగామ జిల్లా జనగామ మండలంలోని పసరమడ్ల గ్రామశివారు చంపక్ హిల్స్‌లోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకున్నది. జనగామకు చెందిన శృతికి యాదగిరిగుట్టకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. గర్భిణి కావడంతో తల్లిగారి ఊరైన జనగామకు వచ్చిన శృతి గతంలో ఇదే ఎంసీహెచ్‌లో వైద్యం చేయించుకున్నది. శుక్రవారం వైద్యం కోసం దవాఖానకు వచ్చి ఓపీ రాయిస్తుండగా ఆధార్‌లో యాదగిరిగుట్టగా ఉండడంతో ఆమెను మీ జిల్లాకు పోయి వైద్యం చేయించుకోవాలని వైద్య సిబ్బంది చెప్పారు. తాను పుట్టింది ఇక్కడే అని, ఈ దవాఖానకు ఇతర జిల్లాల వారు రావడం లేదా? నిలదీసింది. దీంతో కోపంతో నీ జిల్లాకు పోయి చూపించుకో అంటూ దురుసుగా మాట్లాడారని బాధితురాలు తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి పంపించారు.

● చెరువందం.. పక్షి ప్రతిబింబం

సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లి పరిసర ప్రాంతంలో పాండురంగ చెరువు వద్ద మాజీ ఎంపీ సంతోష్‌రావు తీసిన ఫోటో

● శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



తిరుమల వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం సాయంత్రం మీనలగ్నంలో ధ్వజారోహణంతో వాహనసేవలు మొదలయ్యాయి. మధ్యాహ్నం బంగారు తిరుచ్చి ఉత్సవం, సాయంత్రం ధ్వజారోహణంతో శ్రీనివాసుడి బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ గరుడ పటాన్ని అర్చకులు ఎగురవేశారు.

ఊపిరాడక బాలుడి మృతి

- షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం
- పండుగ పూట ఈదులగట్టెపల్లిలో విషాదం

సాయికుమార్ (ఫైల్)

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 4: ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం కాగా, ఇంట్లో నిద్రిస్తున్న చిన్నారి సజీవదహనమైన ఘటన కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లిలో చోటుచేసుకున్నది. ఈదుటగట్టెపల్లి గ్రామానికి చెందిన అంగిడి అనిత-రాజు దంపతులకు కూతురు రితిక, కుమారుడు సాయికుమార్ (7) ఉన్నారు. శుక్రవారం సాయంత్రం సాయికుమార్ ఇంట్లో నిద్రిస్తుండగా.. తల్లీకూతురు బయట ఉన్నారు. షార్ట్‌సర్క్యూట్‌తో ఆరుబయట ఉన్న తాటికమ్మలకు మంటలు అంటుకోగా సాయికుమార్ నిద్రలేచే సరికి ఏం జరుగుతుందో అర్థం కాలేదు. స్థానికులు కాపాడేందుకు ప్రయత్నించినా.. మంటల వ్యాప్తికి ఏం చేయలేకపోయారు. సాయికుమార్ మరో రూమ్‌లోకి వెళ్లి డోర్ పెట్టుకున్నాడు. అప్పటికే మంటల వ్యాప్తి, పొగతో ఊపిరాడక మూలన పడిపోయాడు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సజీవదహనమైన బాలుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. పండుగపూట సాయికుమార్ మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొన్నది. ఘటనా స్థలాన్ని మానకొండూర్ ఇన్‌చార్జి సీఐ స్వామి పరిశీలించి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.